
కథ

# తల్లి ఋణం

## విన్నకోట సుశీలా దేవి



**బ**స్సుదిగి సూట్‌కేసు పట్టుకుని నిలబడ్డాడు రవిచంద్ర. బస్సు దుమ్ము రేపుకుంటూ వెళ్లిపోయింది. చుట్టూ చూశాడు రవి! ఉదయం పదకొండు గంటల సమయం. వైశాఖమాసం ఎండ అప్పటికే చిరచిరలాడుతోంది. కాస్సేపు నిలబడాలన్నా కనుచూపుమేరలో పచ్చనిచెట్టు లేదు. ఇదివరకు ఈ బస్సు ఆగేచోట ఒక పెద్ద నిద్రగన్నేరు చెట్టు ఉండేది. బస్సు దిగగానే దానిక్రింద కాస్సేపు నిల్చునేవాడు. విశాలమైన ఆ చెట్టునీడలో ఒక బడ్డీకొట్టు వుండేది. ప్రక్కనే ఊళ్లోకి వెళ్లడానికి సైకిళ్లు వుండేవి. సైకిళ్ల దగ్గరే సైకిలుకు గాలి కొట్టే కుర్రాడొకడు, వంక్చర్లు వేసే కుర్రాడొకడు ఉండేవారు. బడ్డీకొట్టు ముందు ఒక చిన్న బెంచీ, దానిమీద కూర్చుని చుట్టకాలుస్తూ బడ్డీ తాతతో బాతాఖానీ కొట్టే మనుషులు ఏరీ... వాళ్లందరూ ఏమయ్యారు. అన్నిటికీ మూలమైన ఆ చెట్టేది?

ఎవరైనా బస్సు దిగగానే --

"బాబూ ఇక్కడినుండి ఊరు మూడు మైళ్లుంటది. నడుస్తారా! అయితే ఆ పెట్టె ఇటివ్వండి నేను తీసుకొస్తా!" అంటూ చుట్టుముట్టే కుర్రాళ్లేరీ?

తనీ ఊరు వచ్చి నాలుగేళ్లవుతుందేమో?

ఇంతలోనే... ఇంత మార్పా!

తను చూసిన ఊళ్లన్నీ పట్టణాలు, నగరాలు అయిపోతుంటే తన ఊరేమిటి? ఇలా ఎడారి అవుతోంది?

దాహంతో గొంతు మండుతోంది రవికి. చుట్టుప్రక్కల గుక్కెడు నీళ్లు దొరికేటట్లు లేదు. ఎర్రటి మట్టిని రేపుతూ వేడిగాలి రేగుతోంది.

ఊళ్లోకి వెళ్లాలంటే మూడు మైళ్లు నడవాలి!

ఊఁ...తప్పదు గదా! అనుకుంటూ సూట్‌కేస్ పుచ్చుకుని డొంకదారి వెంట నడవసాగాడు రవిచంద్ర.

కాలికింద ఎర్రటిమట్టి నెర్రెలు వారడంతో, చెప్పులు పగుల్లమధ్య ఇరుక్కుపోయి నడక సాగడంలేదు.

చుట్టూ ఉన్న పొలాలన్నీ బీటలు వడ్డాయి, పంటకాలవలు ఎండి నెర్రెలిచ్చాయి. నిలబడ్డానికి చెట్టుకానీ, తాగడానికి గుక్కెడు నీళ్లు గానీ కనబడ్డంలా.

ఇదేమిటబ్బా పొలాలన్నీ ఇలా బీళ్లు పోయినాయి. బాటమీద ఒక్క మనిషి కనబడలా....

ఏమైంది తన ఊరుకు, ఎందుకిలా మారింది? పచ్చని పొలాలతో, పంట కాలవల్తో, మనుషుల సందడితో కళకళలాడే తన ఊరు

ఎడారయిందే....

ఆలోచిస్తూ నడిచి గంట తర్వాత ఊరు చేరుకున్నాడు. ఊరు మొదట్లోనే తనిల్లు. వీధితలుపు తెరుచుకుని విశాలమైన పెంకుటింట్లోకి అడుగుపెట్టాడు. లోపల అరుగుమీద కూర్చున్న పిల్లలు... రవిని చూసి....

"చిన్నాన్న వచ్చాడు!" అరచుకుంటూ లోపలికెళ్లారు. సూట్‌కేస్ ప్రక్కన పెట్టి, వరండాలోనున్న మంచంమీద కూర్చున్నాడు.

లోపలినుండి పెద్దవదిన పార్వతి పరుగెట్టుకు వచ్చింది.

రవిని చూస్తూ "అబ్బాయ్! నువ్వేనా... ఏమిటిలా అనుకోకుండా ఊడిపడ్డావ్?, అంది సంభ్రమంగా.

"మిమ్మల్ని చూడాలన్పించి వచ్చేశాను! వదినా"

"నువ్వొచ్చి నాలుగేళ్లవలా. చాలా మారిపోయావ్ అబ్బాయ్" అంది.

"నువ్వు మాత్రం చాలా చిక్కిపోయావు వదినా!"

"చిన్నాన్న మాకేం తెచ్చావ్?" పిల్లలు రవి చుట్టూ మూగారు.

"ఒరేయ్! మీ చిన్నాన్న ఇప్పుడేగదా వచ్చాడు. మీదపడి విసిగించకండి!" అందావిడ.

"ఫర్వాలేదులే వదినా!" అంటూ సూట్‌కేస్ తెరిచి స్వీట్లు, బిస్కెట్ల ప్యాకెట్లు తీశాడు.

"నాకు నాకు" అంటూ ఎగబడి తలొక ప్యాకెట్టూ తీసుకుని, కవర్లు చింపేసి ఆత్రంగా తినసాగారు.

వాళ్లలా ఆబగా తినడం రవికి అసహజంగా తోచినా చిన్నపిల్లలు అని సరిపెట్టుకున్నాడు.

"చిన్న వదిన ఏదీ?"

"లోపల పనిలో ఉన్నట్లుంది!"

"ఇవిగో వదినా! నీకు చిన్నవదినకు గాజులు చీరలు!" అంటూ ప్యాకెట్ అందించాడు.

"ఎందుకయ్యా! ఈ డబ్బు ఖర్చు!"

"మెడిసిన్‌లో ఫస్టు వచ్చినందుకు నాకు ప్రైజు ఇచ్చారు వదినా! ఆ డబ్బుతో కొన్నాను!"

"అలాగా!" అంటూ సంతోషంగా లోపలకు తీసుకెళ్లింది.

రవిచంద్ర బట్టలు మార్చుకుని, కాళ్లు కడుక్కోవడానికి నూతి దగ్గరకు వెళ్లాడు. నూతి ప్రక్కన బాదం చెట్టుకింద అంట్లు తోముతోంది చిన్నవదిన కమల.

రవిని చూసి తత్తరపడుతూ లేచింది.

రవి ఆశ్చర్యపోతూ "వదినా! నువ్వు అంట్లు తోమడమేమిటి? పనివాళ్లు లేరా!" అనడిగాడు.

లేని నవ్వు తెచ్చుకుని "ఒంట్లో బాగా లేదని మానేశారులే!" అంది కమల.

"రాములు, సీతమ్మ, పాలేరు వీరన్న, గొడ్లకాడ పనిచేసే కుర్రాళ్లు, అందరికీ ఒకేసారి ఒంట్లో బాగాలేదా!" అన్నాడు.

"లేదులే, పక్కూళ్లో జాతర జరుగుతుంటే వెళ్లారులే. ఈ పని ఎంతసేపని.. చిటికెలో చేసేస్తా... నువ్వలా పోయి కూర్చో... నీతో చాలా మాట్లాడాలయ్యా! వచ్చేస్తా!" అంది కమల.

రవి కాళ్లు చేతులు కడుక్కుని వరండాలో మంచం మీద కూర్చున్నాడు.

పిల్లలు స్వీట్లు తినడం అయినట్టుంది. క్రిందపడినవి ఏరుకుంటున్నారు. దొరక్కపోతే ఏడుస్తున్నారు.

"ఏమిట్రా అల్లరి, బయటకిపొండి!" అని కసిరింది పార్వతి.

"అబ్బాయి కాస్త దాహం తీర్చుకో!" అంటూ మజ్జిగగ్లాసు రవికి అందించింది. దాన్లో నీళ్లే ఎక్కువున్నాయి. కాని ఎండలో వచ్చిన రవికి అదే అమృతతుల్యంగా ఉంది. మజ్జిగ త్రాగి గ్లాసు క్రింద పెడుతూ...

"వదినా! అన్నయ్యలు ఏరీ?" అనడిగాడు.

"పొలానికి వెళ్లారు!" అంది.

రవి వదినవైపు చూశాడు. పచ్చగా, దబ్బపండులా మెరిసేపోయే వదిన నల్లగా పూచికపుల్లలా అయిందేమిటో?

"వదినా! ఒంట్లో బాగాలేదా? అలా ఉన్నావే?" అనడిగాడు.

పార్వతి నవ్వేస్తూ, "ఒంట్లో బాగానే ఉంది. చాలా రోజుల తర్వాత చూస్తున్నావుగా. అందుకే అలా అనిపిస్తుంది. నాకేం... నేను ఇంటి పట్టున హాయిగా ఉన్నా, పట్నం తిండిపడక నువ్వే చాలా చిక్కిపోయావయ్యా!" అంది.

"సరేలే! ఈ మధ్య నేను చాలా లావయ్యానని మా ఫ్రెండ్సు ఎగతాళి చేస్తున్నారు. వాళ్లని నీ దగ్గరకు తీసుకొస్తా!" అన్నాడు నవ్వుతూ.

"ఎవరిని తీసుకొచ్చేది?" కమల తడిచేతుల్ని కొంగుకు తుడుచుకుంటూ వచ్చింది.

"చిన్నవదినా! నువ్వు చెప్పు నేను చిక్కానా! లేదా!" అనడిగాడు రవి.

"ఏమోనయ్యా! నువ్వు పట్నంలో ఏ పిల్లకు చిక్కావో నాకెలా తెలుస్తుంది?" అంది ఎంతో మామూలుగా.

రవి క్షణం తెల్లబోయి ఆ తర్వాత ఫక్కున నవ్వాడు.

"వదినా! భలే ఎదురుదెబ్బ కొట్టావే?"

"మరేం! వదినలంటే ఆషామాషీనా! ఆ... ఇంతకీ మరిదీ నీ చదువైనట్లేనా!" అనడిగింది కమల.

"ఆ మెడిసిన్ అయిపోయింది. ఫస్టుక్లాసులో పాసయ్యాను. కానీ ఇంకా నేను పైకి చదవాలనుకుంటున్నా!" అన్నాడు.

"ఆ" పార్వతి, కమల ఒకరిముఖాలొకరు చూసుకుని గతుక్కుమన్నారు. క్షణం ఆగి పార్వతి అడిగింది.


"అయితే! ఇప్పుడిప్పుడే నువ్వు డాక్టరీ ప్రాక్టీసు పెట్టవా?"

"ఊహూ... లేదొదినా. పై చదువులకు అమెరికా వెడదామనుకుంటున్నా, అప్లికేషను పెట్టాను. అక్కడ యూనివర్సిటీలో సీటు తప్పకుండా వస్తుంది. వచ్చే నెలలో వెడతాను. ఆ విషయం మీకు చెప్పాలనే వచ్చాను. అదీకాక అమెరికా వెళ్లి మళ్లా ఎప్పటికి వస్తానో. అందుకే మిమ్మల్నందర్నీ చూసి రెండ్రోజులు మీతో గడపాలని వచ్చాను. మళ్లా ఎల్లుండి పట్నం వెళ్లిపోతాను. అక్కడ చేయాల్సిన పనులు చాలా ఉన్నాయి!"

ఆ మాటలు వింటూ పార్వతి, కమల శిలల్లా కూర్చుండిపోయారు. ఏం మాట్లాడకుండా కూర్చున్న వాళ్లని చూసి ఆశ్చర్యపోతూ.

"వదినా! ఏమిటలా, అయిపోయారు" అనడిగాడు. మళ్లీ తనే అర్థం అయినట్లు నవ్వేస్తూ, "ఓ! నేను అమెరికా వెళ్లిపోతానని బెంగపడుతున్నారా! ఏంచేస్తాం! తప్పదు వదినా! పెద్దడాక్టరునై పేరుప్రఖ్యాతులు పొందాలంటే, ఇంకా పెద్ద డిగ్రీలు పొందాలి. అందుకు అమెరికా వెళ్లక తప్పదు. మా ఫ్రెండ్సందరూ వెడుతున్నారు. ఈ నాలుగేళ్లు నన్ను చూడకుండా ఉన్నారుగా. అలాగే మరో అయిదేళ్లు. ఎంతలో గడుస్తాయి రోజులు! అయినా వదినా ఇంకా నామీద బెంగేమిటి? నేనేమన్నా చిన్నపిల్లాడినా?" అన్నాడు రవి.

"అదికాదు రవీ! ఈ



సంవత్సరంలో నీ చదువైపోతుందని, ఇక నువ్వు ప్రాక్టీసు పెట్టి డబ్బు సంపాదిస్తావని మీ అన్నయ్యలు అనుకుంటున్నారు" అంది కమల.

పార్వతి కమల చెయ్యి పట్టుకుని 'చెప్పొద్దన్నట్లు' కళ్లతో సైగ చేసింది.

రవి అదేమీ గమనించలేదు.

"వదినా! ఒకప్పుడు ప్రాక్టీసు పెట్టడానికి కేవలం డిగ్రీ సరిపోయేది. కానీ ఈ రోజుల్లో డాక్టరు డిగ్రీకి విలువలేదు. ఏదో ఒక దాన్లో స్పెషలైజేషన్ చెయ్యాలి! ఫారిన్ డిగ్రీలుండాలి. అప్పుడే డాక్టరుగా గుర్తింపు వస్తుంది. ప్రాక్టీసు నడుస్తుంది. అందుకే నేను అమెరికా వెళ్లొచ్చేవరకూ ప్రాక్టీసు పెట్టను. అక్కడ చదువై డిగ్రీ సంపాదించాక అప్పుడాలోచిస్తా! అన్నయ్యలకు పొలాల్లో పనిచెయ్యడం తప్ప ప్రపంచజ్ఞానం శూన్యం. వాళ్లిద్దరికి నేను చెప్తాలే!" అంటూ మంచంమీద వెనక్కి వాలాడు.

"వదినా! నీ చేతివంట తిని ఎన్నేళ్లయిందో! ఆకలి మండిపోతోంది! త్వరగా వంట చేసి వడ్డిస్తావా! నాకేమిష్టమో నీకు తెల్సుగా!" అన్నాడు నవ్వేస్తూ.

"అలాగేనయ్యా! రా కమలా!" అంటూ పార్వతి కమలని తీసుకుని లోపలకు వెళ్లింది.

ఇంటిముందున్న వేపచెట్టునుండి చల్లటిగాలి శరీరాన్ని తాకగా.. రవికి కళ్లు మూతలు పడ్డాయి. అలవాటులేని మూడుమైళ్ల నడక శరీరానికి బాధ కలిగించగా అలసిపోయిన శరీరం విశ్రాంతిని కోరింది!

000

తిరిగి కళ్లు విప్పేసరికి ఇంట్లో ఏదో గొడవగా మాటలు వినిపించసాగాయి.

"అమ్మా! అన్నం వండావుగా! మాకూ పెట్టు! ఈ సంకటి వద్దు!"

"ఊఁ... పడిందీ కన్ను!"

"నాకూ ఆలూకూర వెయ్!"

"అవి మీక్కాదు! చిన్నాన్నకి... నోర్మూసుకుని తినండి!"

"మేం తినం..." కంచం తోసేసిన చప్పుడు.

"వెధవా... నిన్ను..." ఛెళ్... ఛెళ్.. దెబ్బల చప్పుడు. "అక్కా! నువ్వుండు. వీళ్లకు నేను అన్నం పెడతాను... రండి... శీనూ... రాజా... ఇలా రండి. మీకో మంచికథ చెప్తాను!"

రవికి ఆ గొడవేమిటో అర్థం కాలేదు.

లేచి లోపలికి వచ్చాడు.

"వదినా!"

పొయ్యిమీద నుండి గిన్నె దించుతున్న పార్వతి వెనుదిరిగి చూస్తూ, "లేచావా! అబ్బాయ్... రా! ఎండెక్కిపోతోంది... అన్నం తిందువుగాని..." కంచం పెట్టింది.

"అన్నయ్యలు రానీ వదినా! తొందరేముంది?"

"పొలానికి వెళ్లినవాళ్లు ఎప్పటికొస్తారో? వాళ్ల కోసం ఆగడం దేనికి?" అన్నం వడ్డిస్తూ అంది.

ఆలుగడ్డల కూర, ఊరగాయముక్క, పప్పుచారు....

అన్నం కలుపుకున్నాడు.

"ఇదేమిటోదినా... నూకలన్నంలా ఉంది. ఏదో వాసన కూడా" ముఖం చిట్లించాడు రవి.

పార్వతి నవ్వేస్తూ "వడ్లు ఇప్పుడేవో కొత్తరకాలొస్తున్నాయిలే" అంది.

అన్నం తింటుండగా ఇందాక పిల్లలగోల గుర్తుకొచ్చింది రవికి.

"వదినా! పిల్లలకు కూర వెయ్యలేదా ఏమిటి? ఇందాక గొడవ పెడ్తున్నారు!" అనడిగాడు.

"ఎందుకు వెయ్యను! వాళ్లకు చేసిన కూరలు పనికిరావు. ఇంకేవో అడుగుతారు..." అంది.

"వదినా... పల్లెటూరి విశేషాలేమిటి? చెప్పు..."

"ఏమున్నాయ్! అన్నీ బాగానే ఉన్నాయి..." అంది పొడిగా!

"మన పొలాలు బాగా పండుతున్నాయా?"

"ఆఁ! నువ్వేమిటి. సరిగ్గా తినడం లేదు. ఇంకొంచెం అన్నం పెట్టనా?" అంటూ మాట మార్చింది.

"వద్దు! పెరుగు పొయ్యి!"

"పెరుగులేదయ్యా! బర్రెలు చూడిమీదున్నాయి!" అంది.

"సరే!" లేచి వెళ్లి చెయ్యి కడుక్కున్నాడు.

మళ్లా వచ్చి ముందు అరుగుమీద కూర్చున్నాడు. చుట్టూ చూశాడు. విశాలమైన పెరడు. బోసిపోతున్నట్లుగా ఉంది.

'ఎందుకబ్బా... ఇలా ఉంది? ఏవన్నా చెట్లు కొట్టేశారా... ఆ మూలగా గొడ్లసావిడి ఉండాలే... ఏమయింది! ఒట్టికర్రలు కన్పిస్తున్నాయి. పైన ఆచ్ఛాదన లేదు. బర్రెలు పొలానికి వెళ్లుంటాయేమో?... దూడలు లేవే... అన్న గొడ్లసావిడి బాగుచేయించలేదే?.. అలాగే ఉంచేశాడు!

"ఏమిటయ్యా! ఆలోచిస్తున్నావ్!" అంటూ వచ్చింది రెండో వదిన కమల.

"గొడ్లసావిడి... అలా ఉందే వదినా..."

"అదీ..." కమల ఏదో అనబోతుండగా వెనకాలే వచ్చిన పార్వతి అందుకుంది.

"మీ అన్నలు పెద్ద షెడ్డు వేయించడానికి చూస్తున్నారు!"

"అలాగా..."

ఇంతలో వీధి తలుపు తీసుకుని ఇద్దరు కుర్రాళ్లు వచ్చారు.

మంచం మీద కూర్చున్న రవిని చూస్తూ "చిన్నాన్నా! ఎప్పుడొచ్చావ్!" అంటూ పరుగెట్టుకు వచ్చారు.

ఆ ఇద్దరూ పెద్దన్నయ్య కొడుకులు. చిన్న నిక్కర్లు పైన నీరుకావి చొక్కాలతో మట్టికొట్టుకు పోయివున్నారు. పద్నాలుగు, పదిహేనేళ్లుంటాయి. కాని సన్నగా బలహీనంగా ఉన్నారు.

వాళ్లని చూస్తూ..."అదేమిట్రా! అలా ఉన్నారు?... ఇవ్వాళ స్కూలు లేదా? ఏమి ఆటలాడార్రా... అంత దుమ్ము చేసుకున్నారు!" అనడిగాడు రవి.

వాళ్లు తల్లివైపు చూశారు.

పార్వతి నవ్వేస్తూ "ఇవ్వాళ బడికి శెలవిచ్చారులే. అయినా ఏం ఆటర్రా... తిండికూడా తినకుండా... పొండి... కాళ్లు కడుక్కోండి. పిన్నమ్మ అన్నాలు పెడుతుంది!" అంది.

పిల్లలు లోపలికెళ్లారు... వాళ్లతోపాటు కమలకూడా వెళ్లింది.

"వదినా! సీతా, కనకం ఏరీ? కనబడరే! వాళ్లకోసం పట్టులంగా, గాజులు తెచ్చాను!"

సీత పెద్దన్నయ్య కూతురు. కనకం రెండో అన్నయ్య కూతురు...


"వాళ్లూ మామయ్యగారి ఊరువెళ్లారు!" అంది ఎటో చూస్తూ.

"ఏం చదువు మానేశారా?"

"ఆఁ! ఆడపిల్లలకు చదువెందుకులే!"

ఇంతలో "పిన్నమ్మా!... అబ్బ... ఇవ్వాళ... పండుగే... అన్నం... ఆలూకూర... ఓహ్..." లోపల పిల్లలిద్దరూ ఆనందంతో అరుస్తున్నారు.

పార్వతి చటుక్కున లేచి



లోపలకు వెళ్లింది.

ఎందుకంత హఠాత్తుగా లేచి వెళ్లిందో అర్థంకాలేదు.

"పిల్లలుకూడా తన దగ్గరకు ఇదివరకంత చొరవగా రావడం లేదే..." అనుకున్నాడు.

"కమలా! పిల్లల్ని రవి దగ్గరకు పంపించబోకు.." అంటూ లోపల పార్వతి కమలతో చెప్తోంది.

అది విని అనుకున్నాడు "బహుశ తను పడుకుంటాడని అనుకుంటుందేమో..."

"అబ్బాయ్! కాస్సేపు పడుకో!... బాగా ఎండగా ఉంది..." తలగడ ఇచ్చింది.

"పిల్లలేరీ?"

"వాళ్లూ పడుకున్నారులే!" అని లోపలకు వెళ్లిపోయింది.

రవికి ఆ వాతావరణం కొత్తగా అన్పించింది. మునుపటి ఆప్యాయత, ప్రేమ లోపించినట్లయింది. ఏమిటీ మార్పుకు కారణం... చాలాసేపు ఆలోచిస్తూ నిద్రలోకి జారాడు.

పొద్దు పడమరకు మళ్లుతుండగా మెలకువ వచ్చింది. లేచి కూర్చున్నాడు. చేతికున్న వాచీలో టైం చూస్తే ఐదు దాటింది. చాలాసేపు పడుకున్నానే అనుకుంటూ చుట్టూ చూశాడు.

ఎక్కడా ఏవిధమైన అలికిడి లేదు.

ఏమయ్యారబ్బా అందరూ... బర్రెలు కూడా ఇంకా పొలంనుండి వచ్చినట్లు లేవే? అన్నయ్యలూ రాలేదు...

దాహంగా అన్పించింది. మంచినీళ్లకోసమని ఇంట్లోకి వచ్చాడు. పిల్లలు ఎక్కడా కనబడలే! వదినలైనా ఉన్నారా? అనుకుంటూ దొడ్లోకొచ్చాడు. అక్కడ బాదంచెట్టు నీడలో కూర్చుని వదినలిద్దరూ ఇంత ఆకు ఏదో ముందు వేసుకుని బాగుచేస్తున్నారు.


"అక్కా! రవి నిజంగా అమెరికా వెడుతున్నాడంటావా?"

"ఎన్నిసార్లడుగుతావు! మరిదే చెప్పాడు కదా!" అంది పార్వతి.

"అదికాదక్కా! ఈ సంవత్సరం అప్పు తీర్చకపోతే షావుకార్లు ఊరుకోరుకదా! బావగారు తీరుస్తానని మాటకూడా ఇచ్చారుగదా!"

పార్వతి మాట్లాడలేదు.

"బావగారు ఈ విషయం వింటే ఎంత క్రుంగిపోతారో రవిమీదే ఆశలు పెట్టుకున్నారు! రేపు అప్పుతీర్చకపోతే బీడీకట్టడానికి మనంకూడా వెళ్లాలేమో! ఏం అక్కా, మాట్లాడవే!" కమల దిగులుగా అంటోంది.




పార్వతి ఏదో అనబోతూ "వదినా" అంటూ వచ్చిన రవిని చూసి ఆగిపోయింది.

"గ్లాసు మంచినీళ్లిస్తావా!"

"ఆఁ!" లేచి లోపలకు వెళ్లింది పార్వతి.

మంచినీళ్లు త్రాగి, ముఖం కడుక్కుని బట్టలు మార్చుకున్నాడు.

వదిన 'టీ' ఏవన్నా ఇస్తుందేమో చూశాడు. అదేమీ లేకపోయేసరికి "వదినా! నా ఫ్రెండు కామేశం దగ్గరెళ్లొస్తా!" అన్నాడు.

"అతడు ఊళ్లో లేనట్లున్నాడు!"

"అయినా చూసొస్తా! పిల్లలేరీ?"

"ఆడుకోవడానికి పోయారులే! త్వరగా వచ్చేయ్!" అంది పార్వతి.

రవి తలుపు తీసుకుని బయటకొచ్చాడు. చుట్టూ చూస్తూ వీధులవెంట నడవసాగాడు.

ఊరు మునుపటి ఊరులా లేదు మారిపోయింది. చాలా ఇళ్లకి తాళాలు వేలాడుతున్నాయి. ఇళ్లముందు ముగ్గులు లేవు. ఇళ్ల అరుగులమీద మనుషులు లేరు. వీధిలో గొడవగా ఆడుకునే పిల్లలు లేరు. ఏ ఇల్లు సరిగ్గా లేదు. పెంకుటిల్లు పాడుబడిన గృహాల్లా ఉంటే, పాకలు ఆకుల్లేక బోసిగా ఉన్నాయి. అక్కడక్కడ ఇళ్లముందు ఒకరిద్దరు ముసలాళ్లు కూర్చుని వీధులవేపు చూస్తున్నారు.

రవికిదంతా ఆశ్చర్యంగా ఉంది.

ఏమైంది తన ఊరుకు!

ఏ మహమ్మారి పట్టి పీడిస్తోంది!...

నడుచుకుంటూ ఊరు చివరికొచ్చాడు. ఒకప్పుడక్కడొక పెద్ద చెరువుండేది. ఇప్పుడది ఎండిపోయి నెర్రెలు వారింది.

చెరువు ఆవలిగట్టున పెద్దగుంపు కనబడింది. ఊళ్లో జనం అక్కడున్నట్లున్నారే! ఏ రాజకీయనాయకుడైనా మీటింగు పెట్టలేదుగదా! ఎవరో, ఏమిటో చూద్దాం! అనుకుంటుండగా, ఆ చెరువు మధ్యనుండి ప్రకాశం మాస్టారు గబగబా నడుచుకుంటూ వస్తూ కనబడ్డారు.

రవి ఆయనకెదురుగా వెళ్ళి "మాష్టారు!" అని పిలిచాడు.

తలొంచుకొస్తున్న ఆయన ఉలిక్కిపడి తలెత్తారు.

"నువ్వు...?"

"రవిని మాష్టారూ!"

"అలాగా..." కండువా చాటునున్న వస్తువును మరింత దాచుకుంటూ, "బాగున్నావా! తొందరగా వెళ్లాలి!" అని ముందుకు నడిచారు.

"ఏం మాష్టారు! ఎందుకంత కంగారు పడుతున్నారు? ఏం జరిగింది. మీరు చాలా చిక్కిపోయారు... ఈ ఊరు కూడా చాలా పాడైపోయింది! కారణం ఏమిటి మాష్టారూ?" రవి ప్రశ్నలవర్షం కురిపించాడు.

మాష్టారు చిన్నగా నిట్టూర్చారు.

"మాష్టారూ! నేనీ ఊళ్లో అడుగుపెట్టినప్పట్నించీ ఈ ఊరు విషయం తెలుసుకోవాలని ఆరాటపడుతున్నాను. చెప్పేవాళ్లు లేరు! ఇప్పుడు మీరు కనబడ్డారు, చెప్పండి మాష్టారూ!" బ్రతిమిలాడాడు.

"ఇంటికెళ్లి మాట్లాడుకుందాం... రా బాబూ!" అన్నారు.

పదినిమిషాల్లో మాష్టారి ఇల్లు చేరుకున్నారు.

"అరుగుమీద కూర్చో, ఇప్పుడే వస్తాను!" అని లోపలికెళ్లారు. రవి కూర్చున్నాడు. మాష్టారి ఇంటి ముందు ఇదివరకు చక్కని పూలతోట ఉండేది. ఇప్పుడొట్టి దడి మాత్రమే ఉంది. ఆవులతో కళకళలాడే దొడ్డి బోసిపోయినట్లుగా ఉంది....

కొద్ది క్షణాల తర్వాత ప్రకాశం మాష్టారు వచ్చి రవి ప్రక్కన కూర్చున్నారు.

"రవీ! చాలా పెద్దవాడైపోయావ్!"

"అంతా మీ ఆశీర్వాదం మాష్టారూ!"

"నాదేముందయ్యా! శ్రద్ధగా చదివావ్ పైకొచ్చావ్! నీ డాక్టరు కోర్సు పూర్తయిందా?" అనడిగారు.

"అయిందండీ!"

"ప్రాక్టీస్ ఎక్కడ పెడ్తున్నావ్!"

"నేను వచ్చే నెలలో అమెరికా వెడుతున్నానండీ పై చదువులకు!"

"అలాగా... చాలా మంచివార్త చెప్పావ్! మీ అన్నయ్యలు ఏమన్నారు?" అనడిగారు.

"ఇంకా పొలంనుండి రాలేదు వాళ్లు! వచ్చాక చెప్తా!"

"పొలమా?" తెల్లబోయారాయన.

"అదేం మాస్టారూ! అలా అన్నారు! మా అన్నయ్యలు పొలానికి వెళ్లారని వదిన చెప్పింది!" అన్నాడు రవి.

మాస్టారు చిన్నగా నిట్టూరుస్తూ "రవీ! ఇందాక అడిగావే ఈ ఊరు ఎందుకిలా అయిందని, ఇప్పుడు చెప్తా విను! మన ఊరే కాదు ఈ తెలంగాణాలో ఏ ఊరుని పలకరించినా ఈ విషాదగాథలే వినబడుతాయయ్యా!"

"ఏమిటివి మాస్టారూ!"

"ఈ ప్రాంతాల్లో వర్షాలు పడి నాలుగేళ్లయింది. కాలవలు ఎండిపోయాయి. పంటల్లేవు. తినడానికి తిండి లేదు. తాగడానికి నీళ్లు లేవు. అయినకాడికి పొలాలు, దొడ్లు, పశువుల్ని అమ్ముకుని పట్నం పోయారు కొందరు. మరికొందరు తిండిలేక చచ్చారు. మరికొందరు అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకున్నారు. మిగిలినవాళ్లమిలా జీవచ్ఛవాల్లా బతుకుతున్నాం!"

"ప్రభుత్వం మీకేం సహాయం చేయలేదా?"

రవి ప్రశ్నకు నవ్వారు మాస్టారు.

"ఏం చేస్తుందయ్యా! అధికారంలో ఉన్నవాళ్లకి పదవిలో ఉండగానే కోట్లు గడించాలనే ఆరాటం... ఎవడికివాడు తమ స్వార్థం చూసుకుంటారేగాని... మా గురించి ఎవరాలోచిస్తారు? ఇటీవల కొన్ని రాజకీయపార్టీలు గంజికేంద్రాలు పెట్టి మేం పూర్తిగా చావకుండా మమ్మల్ని కాపాడుతున్నారు. ఇదయ్యా ఈ ఊరికథ!"

అది విని రవి నిశ్చేష్టుడయ్యాడు.

తన ఊరు పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా తనకేం తెలీదే! అన్నయ్యలు ఎప్పుడూ చెప్పలా! అదే అన్నాడు.

"మా అన్నయ్యలు ఈ విషయం నాకేం చెప్పలేదే?"

"బహుశ ఇలా చెప్తే నీ చదువు మధ్యలో ఆపి వచ్చేస్తావేమోనని భయపడివుంటారు!"

అదే అయ్యుంటుంది. తను సెలవులకు ఊరికి వస్తానన్నా రావొద్దని చెప్తూ పట్నంలో ఉండి బాగా చదువుకోమని ఉత్తరాలు వ్రాయడానికి ఇదే కారణమేమో?" అనుకున్నాడు రవి.

"అయితే మాస్టారూ! మా పొలాలకి నీళ్లెక్కడినుండి వస్తున్నాయి!"

మాస్టారు బాధగా నవ్వారు.

"ఇంకా మీ అన్నయ్యలకు పొలాలెక్కడివయ్యా? ఎప్పుడో అమ్మేశారు. పశువుల్ని అమ్మారు. స్థలాలు అమ్మారు! ఉన్న ఇల్లు కూడా తాకట్టులో ఉంది! ఇన్నేళ్ల నీ చదువుకు డబ్బెలా వస్తోందనుకున్నావ్!"

"ఆ..." గుండె ఆగినట్లయింది రవికి.

"మరి వాళ్లెలా బ్రతుకుతున్నారు?" బాధగా అడిగాడు.

"కొన్నాళ్లు పొరుగూళ్లో కూలిపనికి వెళ్లారు. ఇప్పుడు ఆరుమైళ్ల దూరంలో ఉన్న సిమెంట్ ఫ్యాక్టరీలో పని చేస్తున్నారు. మగపిల్లల్లో పెద్దవాళ్లిద్దరూ బీడీ పనిలో ఉన్నారు. ఆడపిల్లలిద్దర్ని పట్నంలో ఎవరింట్లోనో పనికి పెట్టారు. మీ అన్నయ్యలు, పిల్లలు ఇప్పుడు గంజికోసం కేంద్రంలోనే ఉన్నారు."

"మాస్టారూ! ఇక చెప్పకండి గుండెలు బ్రద్దలైపోతున్నాయి. నాకు తెలియకూడదని ఎన్ని ఘోరాల్ని దాచిపెట్టారు. ఎంత భయంకరంగా ఉంది ఇంటి పరిస్థితి... ఇప్పుడు నేనేం చెయ్యాలి..." కళ్లవెంట నీళ్లు జారాయి రవికి.

మాస్టారు రవి భుజంమీద చెయ్యి వేశారు.

"బాధపడకు రవి... కష్టమంతా నీకోసమేగా! నువ్వు డాక్టరువైతే వాళ్ల బాధలన్నీ తీరిపోతాయని ఆశపడ్డారు... నువ్వు డాక్టరువయ్యావు... వాళ్ల కోరికలు తీరినట్లేగా!"

రవి మాట్లాడలేదు.

తను వాళ్ల కష్టాలు తీరుస్తాడా? ఊహూం...

లేదు.. తను చాలా దుర్మార్గుడు. ఇక్కడి పరిస్థితి పట్టించుకోకుండా అమెరికా వెళ్లబోతున్నాడు. అక్కడి జీవితాన్ని గూర్చిన అందమైన కలల లోకంలో విహరిస్తున్నాడు. మాస్టారు కనబడి ఈ విషయాలు చెప్పకపోతే తనింకా ఆ కలల్లోనే విహరించేవాడు. వాస్తవాన్ని పట్టించుకునేవాడు కాదు... ఎంత ఘోరం జరిగేది.

"మాస్టారూ! ప్రొద్దుటినుండీ వదినలు ఎన్ని అబద్దాలు చెప్పారు!"

మాస్టారు నవ్వుతూ, "బహుశ మీ అన్నయ్యలు చెప్పమని ఉంటారు... ఇక్కడ మన ఆడవాళ్లకి భర్తల మాటలే శిరోధార్యం కదా!"

రవికి వెంటనే అన్నయ్యల్ని చూడాలనిపించింది.

"వెళ్లొస్తా... మాస్టారూ!"

"ఉండు బాబూ! గ్లాసుడు మంచినీళ్లయినా ఇస్తా, ప్రస్తుతం నీళ్లతోనే మా అతిథి మర్యాద...!" అని లోపలకు వెళ్లారు.

రవికి మాస్టారి ఇంటిముందు పూలతోట ఎందుకు లేదో! దొడ్లో ఆవులు ఏమయ్యాయో అర్థమైంది.

అన్నయ్యలకు పశువులు ఆరోప్రాణం! వాటిని అమ్మేస్తుంటే వాళ్లెంత బాధపడి ఉంటారో....

"రవీ! ఇవిగో మంచినీళ్లు... మొన్నటివరకూ ఇంటికొచ్చినవాళ్లకు గ్లాసుడు మజ్జిగ ఇచ్చేవాళ్లం. కానీ... అమ్మాయి పెళ్లికని... ఆవుల్ని కబేళాకు పంపాల్సి వచ్చిందయ్యా!"

మాస్టారి కళ్లు నీటితో నిండిపోయాయి. కండువా ముఖంమీద వేసుకుని బావురుమన్నారు.

"మాస్టారూ ఊర్కోండి... బాధపడకండి... మళ్లా మంచిరోజులొస్తాయండీ!"

మాస్టారు తేరుకుని....

"నేనిప్పుడు మాస్టార్ని కాదయ్యా రవీ! స్కూలు లేదు, పిల్లల్లేరు..." మాస్టారి గొంతు దుఃఖంతో పూడుకుపోయింది. మాస్టారి బాధ గుండెల్ని ద్రవింప చేస్తోంది.

"వస్తా... మాస్టారూ!" అంటూ గబగబా నడిచి ఇంటికొచ్చాడు రవి.


బయట నులకమంచం మీద కూర్చొన్న అన్నయ్యలిద్దరూ గంజి కాబోలు తాగుతున్నారు.

రవిని చూడగానే చేతిలో గిన్నెలు కిందపెట్టి "రవీ... తమ్ముడూ!" అంటూ ఆప్యాయంగా కౌగలించుకున్నారు.

కుశలప్రశ్నలయ్యాక...

"అన్నయ్యా! ప్రొద్దుటినుండీ కనబడలా ఎక్కడికెళ్లారు!" అనడిగాడు రవి.

"పొలాల్లో ఎరువులు వేస్తున్నారు. అందుకని ఆలస్యమైంది!" అన్నారు.



రవి మనసు కలుక్కుమంది. వీళ్లు తననింకా భ్రమలో ఉంచుతున్నారు. నిజం చెప్పడం లేదు. చూద్దాం ఎంతసేపు దాచిపెడ్తారో! తనెందుకు బయటపడాలి! అనుకున్నాడు.

"అన్నయ్యా! ఏమిటి? త్రాగుతున్నారు?"

"అదా గంజి! ఒంట్లో నలతగా ఉంటే ఆచార్యులుగారు తాగమన్నారు... అందుకని"

"నాకేమైనా ఉంచారా?"

"చాల్లే పరిహాసం... వదిన అన్నం వొండి ఉంచింది... లే... వెళ్లి తిను..." అన్నాడు పెద్దన్నయ్య.

"తింటాలే.. ఊ... మన పొలాలు... పశువులు... ఎలా ఉన్నాయి?" అనడిగాడు రవి.

"అన్నీ బాగానే ఉన్నాయి కానీ నువ్వెక్కడికి వెళ్లొచ్చావ్!" అంటూ మాటమార్చాడు.

"పక్కవీధిలోకే...లే! అన్నయ్యా! నా డాక్టరు కోర్సు అయిపోయింది. వచ్చేనెలలో అమెరికా వెళ్లాలనుకుంటున్నాను!" అన్నాడు వాళ్ల ముఖాల్లోకి చూస్తూ...

వాళ్ల ముఖాలు నల్లబడ్డాయి.

"అవును... మీ వదిన చెప్పింది!"

అప్పటికి కూడా వాళ్లు బయటపడలేదు. అన్నయ్యల ఆప్యాయతకు బాధగానూ, కోపంగానూ ఉంది.

"కానీ అన్నయ్యా! అమెరికా వెళ్లడానికి నాకు డబ్బు కావాలి! అదడుగుదామనే వచ్చా!" అన్నాడు కసిగా.

"డబ్బా!" వాళ్లిద్దరితో పాటు వసారాలో కూర్చున్న వదినలు కూడా ఉలిక్కిపడ్డారు.

"ఎంత?" రెండో అన్నయ్య మెల్లగా అడిగాడు.

"పాతికవేలు!"

"అంత డబ్బే!"

"ఏం లేదా?"

అన్నదమ్ములిద్దరూ ముఖాలు చూసుకున్నారు.

"డబ్బు రెడీగా లేకపోతే నావాటా పొలం, ఇల్లు నాకే ఉంది... అమ్మేసి డబ్బు తీసుకుంటా!" అన్నాడు కోపంగా.

వాళ్లు అప్పటికీ బయటపడలేదు... పైకి కోపంగా ఉన్నా, మనసులో దుఃఖపడుతున్నాడు రవి.

"ఏం నా వాటా లేదా?"

"మొదటి సంవత్సరం నీ చదువుకు నీ వాటా పొలం అమ్మేశాం రా! అప్పుడు నీకు చెప్పే చేశాం గదా! వర్షాలు లేకపోవడం వలన పొలాలు బీళ్లయిపోయినాయి... ఎక్కువ ధర రాలేదు!"

"ఓహో... అలాగా! అలా అయితే మిగతా సంవత్సరాల్లో పంపిన డబ్బుకు ఏం అమ్మారు?"

అన్నయ్యలు మాట్లాడలేదు.

మరిది కొత్తగా మాట్లాడుతున్నాడు అనుకున్నారు వదినలు.

"ఏం మాట్లాడరే... మీ పొలాలు అమ్మేశారా?"

"అబ్బ... రవీ! ఇప్పుడవన్నీ దేనికి అమెరికా వెళ్లడానికి నీకావల్సిన డబ్బు ఎలాగో సమకూర్చిపెడతా సరేనా... దిగులుపడకు...!" పెద్దన్నయ్య అంటున్నాడు.

రవికి మంటెక్కిపోతోంది ఆ ధోరణికి.

స్వార్థం కోసం తమ్ముళ్లని బలిచ్చిన అన్నలున్న ఈ లోకంలో తమ్ముడి కోసం తమ జీవితాల్నే బలి ఇస్తున్నారే... ఇటువంటి అన్నలున్న తనెంత అదృష్టవంతుడు....

పొంగుకు వస్తున్న దుఃఖాన్ని మనసులోనే దాచుకున్నాడు. ఇంత ప్రేమకు తను అర్హుడు కాడు. వీళ్ల ఆప్యాయత, అభిమానం భరించలేకపోతున్నాడు. మరొక్క మాట అన్నగారి నోటి నుండి వింటే తన గుండె బ్రద్దలైపోతుంది. ఇక తను సహించలేడు.

లేని కోపం తెచ్చుకుని విసురుగా లేచాడు.

"ఏం చేస్తారు! పాతికవేలు ఎలా సమకూర్చి పెడతారు! అమ్మడానికి పొలంలేదు. ఇల్లులేదు. దొడ్లో పశువులు లేవు. తాకట్టు పెట్టడానికి ఇంట్లో పిల్లలు కూడా లేరు. పసిపిల్లలందర్నీ పనిలో పెట్టారుగా! ఇంకేం చేస్తారు? మీకు మీరే అమ్ముడుపోతారా! చెప్పండి!" పిచ్చిగా అరవసాగాడు రవి.

చిన్నాన్న అరుపులకు భయపడి పిల్లలు తల్లి వెనకాల దాక్కున్నారు.

వదినలు బిత్తరపోయారు.

అన్నయ్యలు తలొంచుకున్నారు.

రవి దుఃఖాన్ని ఆపుకోలేకపోయాడు. చటుక్కున అన్నయ్యల కాళ్లమీద పడ్డాడు.

"అన్నయ్యా! మీ మంచితనాన్ని భరించడం ఇక నావల్ల కాదు. నాకంతా తెలిసింది. మంచితనానికి కూడా హద్దు ఉంటుంది. నాకోసం మీ కుటుంబాల్ని బలి ఇచ్చారు గదా! ఇంతటి మంచితనం, ఆప్యాయతలు, అభిమానాలు లోకంలో ఎక్కడైనా ఉన్నాయా! మీ స్థితి గమనించకుండా నేను మీమీద నుండి నడుచుకుంటూ విమానం ఎక్కి విదేశాలకు వెళ్లాలనుకున్నా! ఎంత దుర్మార్గుడిని నేను! ప్రకాశం మేష్టారు అంతా చెప్పి నా కళ్లు తెరిపించారు అన్నయ్యా! నా కోసం ఇంత చేసిన మీ ఋణం ఎలా తీర్చుకోగలను!" అన్నాడు దుఃఖంతో.

రవిని లేవనెత్తి ప్రక్కన కూర్చోబెట్టుకున్నాడు పెద్దన్న.

"తమ్ముడూ! నువ్వుండే పట్నం విషయం నాకు తెలీదుగానీ! మన ఊళ్లల్లో మన కుటుంబాల్లో ఇవన్నీ చాలా సహజమయ్యా! ఒకరికోసం బ్రతకడమే నేర్పింది మన నేలతల్లి! ఇక్కడందరూ ఇంతే! ఇదేం గొప్పకాదయ్యా! మనలో మనకు ఋణాలేమిటి? మనమందరం మనం పుట్టిన నేలతల్లికి ఋణపడ్డాం!" అన్నాడు.

"నువ్వు అమెరికా వెళ్లడానికి మేం డబ్బు సమకూరుస్తాం!" అన్నాడు చిన్నన్నయ్య.

చటుక్కున అందుకుని.. "అన్నయ్యా! ఇక నువ్వా మాట ఎత్తకు? నేనూ ఇక్కడ పుట్టినవాడిని కదా! ఈ నేలతల్లి ఋణం నేనూ తీర్చుకోవద్దా!" అంటూ నవ్వాడు రవి. అన్నలు స్థిమితపడ్డారు.

వాతావరణం తేలిక పడింది.

ప్రొద్దుటినుండీ ముభావంగా ఉన్న వదినల ముఖాల్లోకి కాంతి చూసి ఆనందించాడు రవి.

"అబ్బ! నీ అరుపుల్తో మాకు గుండె జబ్బులు తెప్పించావుకదయ్యా మరిదీ!" అంది కమల.

"డాక్టరు చిన్నాన్న ఉన్నాడుగా ఇక ఏ జబ్బొచ్చినా పర్లేదమ్మా!" అన్నాడు కమల కొడుకు.

అందరూ నవ్వారు!

■

